

# స్కూలు మీద కర్ర పెత్తనం

**అ**దివరకు స్కూలంటే మా అమ్మమ్మకు పిచ్చికోపం. 'ఒకటే కాకిగోల. చదువు తక్కువ జాతరెక్కువ. కంచు కంఠాలు వేసుకుని మేష్టార్లగోల. గణగణ గంటలు. ఇదెక్కడి పీడాకారం, మనింటిపక్క మా ఇల్లుకూడా కిష్కింధాపురం చేసి పెడుతున్నారు'– అని ఎవరొచ్చినా మొరపెట్టుకునేది.

అయితే మేము స్కూల్లో జేరాక ఆవిడకి స్కూలుమీద అభిమానం పెరిగింది. 'పిల్ల సన్నాసులు అల్లరి చెయ్యకపోతే మనం చేస్తామా?' అని పిల్లలమీద జాలి పడేది. అటు రాలిన బాదంకాయలు ఏరకుండా వదిలేసేది. చింతచెట్టెక్కి కాయలు కోసుకున్నా ఏమీ అనేది కాదు.

పాపం ఆ మేష్టార్లు పొట్టకూటికోసం వచ్చి గొంతులరిగిపోయేలా పాఠాలు చెప్తారు. ఎండవేళ కాసిని మజ్జిగతేట ఇస్తే ప్రాణం కుదుటపడుతుంది వాళ్ళకి – అని పెద్దకుండెడు మజ్జిగతేట కలిపి నిమ్మాకూ కరివేపాకూ శొంఠిపొడీ సైంధవ లవణం చేసి సిద్ధంగా ఉంచేది. ఎండవేళప్పుడు దస్సిపోయి ఉన్న మేష్టర్లని పేరుపేరునా పిల్చి పెద్దగ్లాసుతో మజ్జిగతేట ఇస్తుంటే అమృతంలా తాగేవారు.

పండగ రేపనగా ఇన్ని కరివేపాకు మండలు కోయించి గోడవతల పడేసేది. ఉండ్రాళ్ళతద్దెకీ అట్లతద్దెకీ రెండురోజులు ముందు గోరింటకొమ్మలు కోయించి పడేయించేది.

పిల్లలకీ మేష్టార్లకీ మా అమ్మమ్మ నెత్తిమీద దేవత. వాళ్ళు గౌరవిస్తున్న కొద్దీ చనువు ఎక్కువయింది. అన్నిటా తలదూర్చడం ప్రారంభించింది.

ఒకరోజు దక్షిణంవైపు కూర్చుని అరటిదూట తరుక్కుంటోంది. పక్కన స్కూల్లో సోషలుమాష్టారు రామతారకంగారు పాఠం చెబుతున్నారు.

"మన దేశమును ఎందరో రాజులు పాలించిరి. అశోకుడు పాలిచ్చెను, హర్షవర్ధనుడు పాలిచ్చెను, బింబాసురుడు పాలిచ్చెను"-అంటూ దీక్షగా చెప్పుకు పోతుంటే- అమ్మమ్మ "రామతారకంగారూ ఇట్రండి. ఇందాకటినుంచి వింటున్నాను. ఆ రాజు పాలిచ్చాడు, ఈ రాజు పాలిచ్చాడు అంటున్నారు. పాలివ్వడానికి వాళ్లేమైనా పాడిపశువులా?" అని అడిగింది.

ఆయన తడబడిపోయి "అదికాదండీ పెద్దమ్మగారూ. పరిపాలించారు అని చెప్తున్నా" అన్నాడు.

"బాగానే ఉంది. మీరు వినలేదేమో! మొన్న దేవుడిగుళ్ళో వరికూటి జయమ్మగారు హరికథ చెబుతూ ఫలాని చక్రవర్తి ఫలాని నగరాన్ని రాజధానిగా చేసుకుని రాజ్యమేలినారు అని ఎంత స్పష్టంగా చెప్పిందో! మీరూ అలాగే చెప్పొచ్చుగా. పాలిచ్చారు, పెరుగిచ్చారు అని సొంతకవిత్వం ఎందుకూ?" అంది. మేష్టారి మొహం చిన్నబోయింది.

పిల్లలంతా కిసుక్కున నవ్వేరు.

మేష్టారు ఏమీ చేయలేక బెత్తం తీసుకుని 'సైలెన్స్ సైలెన్స్' అని బల్లమీద బాదేశారు.

మరోరోజు లెక్కలమాష్టారు "ఒక తొట్టెలో నీరు నింపుటకు పట్టుకాలము రెండుగంటలా ముప్ఫై నిముషములు-ఖాళీ చేయుటకు పట్టుకాలము గంటా నలభై నిముషములు"-అంటూ స్టెప్పులు వేసి లెక్కలు చేయిస్తుంటే గోడమీంచి తొంగిచూసి-

"హనుమంతూ ఇట్రా" అని పిల్చింది అమ్మమ్మ.

"ఇదంతా నీ నిర్వాకమా నా తండ్రీ. నిన్న మా మనవరాలూ దాని స్నేహితురాళ్ళు ఏకమై తొట్టెడునీళ్ళూ పారబోస్తే ఏవిటో అనుకున్నాను. పిల్లలకి ఇటువంటివన్నీ నేర్పవచ్చునా?" అని నిలదీసింది.

"అది కాదత్తయ్యా! ఇవి లెఖ్ఖలు. కాలమానం" అంటూండగానే అడ్డుపడి-

"ఇవే లెఖ్ఖలూ! కావలిస్తే కూడికలూ తీసివేతలూ నేర్పించు. అంతేగానీ నీళ్ళుపట్టడం, పారబొయ్యడంలాటి కోతి పన్లన్నీ నేర్పిస్తే వాళ్ళని ఆపగలమా?" అని కసిరేసింది.

మాస్టర్లతో ఆగలేదు. ఆ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవానికి బాలకోటయ్యగారిని జెండా ఎగరెయ్యడానికి పిల్చారు. బాలకోటయ్యగారిది మా ఊరే. ఖద్దరు బట్టలు కట్టుకుని రాజకీయాలు చేస్తూ అడపాదడపా హైదరాబాదు వెళ్ళి వస్తున్నారుట. మన కళ్ళముందు పుట్టి పెరిగినవాడు అభివృద్ధిలోకి వస్తున్నాడు అని ఆనందపడ్డారు తాతయ్య.

బాలకోటయ్యగారొచ్చారు. జెండా ఎగరేసి ఉపన్యాసం అందుకున్నారు. 'స్వతంత్రం' వచ్చింది అంటూ ఏవిటేవిటో చెప్తున్నాడు.

దొడ్లో అరుగుమీద నిలబడి కార్యక్రమం చూస్తున్న అమ్మమ్మ హఠాత్తుగా అరిచింది.

"బాలకోటయ్యా! మాట. పాడిందేపాడరా అని ఇందాకటినించీ సొతంత్రం సొతంత్రం అని ఒకటే చెప్తున్నావు. నీకేం? నిక్షేపంలా నీడన నిలబడ్డావు. పిల్ల వెధవలందరూ ఎండలో ఉన్నారు. అసలే పొద్దునపూట ఎండ పైత్యం చేస్తుంది. చూడెట్లా నీరసపడి పోతున్నారో? నువ్వు చెప్పేదేవిటో-పెద్ద ముండాదాన్ని నాకే అర్థం కావడంలేదు. ఆ పిల్ల సన్నాసులకు ఏం అర్థం అవుతుంది? ఇక చెప్పింది చాలుగానీ ఆ బిస్కత్తులో, పిప్పరమెంటు బిళ్ళలో పెట్టి పిల్లల్ని ఇంటికి పంపండి.." అని జాడించేసరికి అంత పెద్దమనిషీ బెదిరిపోయి-

"కాబట్టి పిల్లలూ! మీరంతా బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలి" అని ఉపన్యాసాన్ని హఠాత్తుగా ముగించేశారు.

పిల్లలమంతా అమ్మమ్మని మెచ్చుకున్నాం. ఆవిడ నోరు చేసుకోబట్టి సరిపోయిందిగానీ ఆ బాలకోటయ్యగారు సాయంత్రందాకా మాట్లాడేవారే.

ఆ విధంగా అమ్మమ్మ స్కూలుని దడదడలాడిస్తూ ఉంటే ఒకరోజు పొద్దున్నే హెడ్‌మాష్టారుగారు మేస్టర్లని వెంటబెట్టుకుని తాతయ్య దగ్గరికి వచ్చారు.

దేవతలరాజు విష్ణుమూర్తితో మొరపెట్టుకున్నట్లు తమ కష్టాలన్నీ ఏకరువు పెట్టుకున్నారు.

"కరణంగారూ! మొన్నామధ్య నేను ఆ చివరిదాకా వెళ్ళి నా తంటాలేవో నేను పడుతుంటే, ఈవిడెక్కడినించీ చూసిందో-నన్ను పిలిచి 'ఇప్పటిదాకా ధూమపానం అనారోగ్యం' అని పాఠంచెప్పి ఈమూల నిలబడి బీడీముక్క కాలుస్తున్నావా? తప్పుకదుటయ్యా అని మందలించారండీ!" అని మొరపెట్టుకున్నారు పాండు రంగవిఠల్‌గారు.

"కరణంగారూ! వచ్చేవారం మా స్కూలుకి డీఈఓ గారు ఇనస్పెక్షన్‌కి వస్తున్నారు. వారిముందు ఈవిడిలాగే మమ్మల్నందర్నీ పిలిచి పాఠాలు చెబితే మా ఉద్యోగాలూడి పోతాయి. అన్యథా శరణం నాస్తి. మీరే పూనుకుని మమ్మల్ని కాపాడాలి" అన్నారు హెడ్‌మాష్టారుగారు దీనంగా.

గుండు తడువుకుంటూ ఆలోచించారు తాతయ్య. "ఆవిడకి చెప్పాలంటే మన తరం కాదుకానీ ఓ పనిచేస్తాను. ఆ ఇనస్పెక్షను ఎప్పుడో చెప్తే ఆ రెండు రోజులూ ఈవిడని వాళ్ళ పుట్టింటికి పంపిస్తాను" అన్నారు.

"బాబ్బాబు. ఆ పనిచేసి పుణ్యం కట్టుకోండి. చచ్చి మీ కడుపున పుడతాం" అన్నారందరూ ముక్తకంఠంతో.

* * *